ఉత్తరం
# కాకతీయ
TG TEL/25/A1234
www.kakatiyanews.com
ఆదివారం, 11 అక్టోబర్ 2026 | సంపుటి: 02 సంచిక: 52 | పేజీలు: 4 వెల: 5

హన్మకొండ చారిత్రక వేయిస్తంభాల ఆలయం ప్రాంగణంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు,యువతులు



## పూలలో ప్రకృతి పరిమళం.. పాటలో తెలంగాణ ప్రాణం!

తీరొక్క పూలతో బతుకమ్మకు అలంకారం

ఉయ్యాల పాటలతో మారుమోగిన పల్లెలు, పట్టణాలు

హన్మకొండలోని చారిత్రక వేయి స్తంభాల ఆలయంలో ఘనంగా సంబురాలు



**కాకతీయ,తెలంగాణ బ్యూరో :** పూలను పేరిస్తే ప్రకృతి పరిమళం.. బతుకమ్మను కొలిస్తే తెలంగాణ ఆత్మీయత.. ఉయ్యాల పాట ఎత్తుకుంటే తరతరాల సంస్కృతి సజీవం! రంగురంగుల పూల మధ్య గౌరమ్మను కొలుస్తూ, చప్పట్ల నడుమ జానపద గీతాలను ఆలపిస్తూ తెలంగాణ ఆడపడుచులు పూల పండుగకు స్వాగతం పలికారు. పూలలో ప్రకృతిని, బతుకమ్మలో బతుకును, పాటలో తమ నేల గొప్పతనాన్ని చూసుకునే తెలంగాణ సంస్కృతి మరోసారి పరిమళించింది. పల్లె ముంగిళ్ల నుంచి నగర కూడళ్ల వరకు పూల సోయగాలు విరబూశాయి. ఎంగిలి పూల బతుకమ్మతో మొదలైన సంబురాలు మహిళల ఆటపాటలు, సంప్రదాయాల సందడితో అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో.. అంటూ మహిళలు గొంతెత్తి పాడుతుండగా పూల పండుగ వాతావరణం ఆహ్లాదభరితంగా మారింది.

**ఎంగిలిపూల బతుకమ్మతో పండుగ షురూ**

తెలంగాణవ్యాప్తంగా బతుకమ్మ సంబురాలు ప్రారంభమయ్యాయి.

........(తరువాయి 3లో)

## వ్యవసాయ భూముల ముసుగులో రియల్ ఎస్టేట్ వ్యాపారం

వీకెండ్ హోమ్ పేరుతో ప్లాట్ల విక్రయాలు

రోడ్లు వేస్తూ స్థలాల విభజన..

అనుమతుల సంగతేంటి?

నాలా ఒకటైతే.. లేఅవుట్ అనుమతి మరొకటి

వెంచర్లపై అధికారుల తనిఖీలు ఏవీ?

దసరా పండుగ వేళ భూముల వ్యాపారానికి కొత్త రంగు పులుముతున్నారు! వ్యవసాయ భూములకు వీకెండ్ హోమ్ ముసుగు తొడిగి, ప్రకృతి ఒడిలో ప్రశాంత జీవనం అంటూ ప్రచారం చేస్తున్నారు. జాతీయ రహదారులకు దగ్గరగా తక్కువ ధరకే స్థలం.. భవిష్యత్తులో భారీ లాభాలు.. ఇప్పుడే కొంటే పండగే పండగ అంటూ కొనుగోలుదారులకు ఆశల వల విసురుతున్నారు. వెంచర్ రూపంలో భూములను అభివృద్ధి చేస్తూ, అంతర్గత రహదారులు వేస్తూ, స్థలాలను గుర్తించి ప్లాట్ల తరహాలో విక్రయాలు సాగిస్తున్న వ్యవహారాలు పరిశీలన కోరుతున్నాయి.



## దసరా వేళ ఫామ్‌ల్యాండ్

# దందా జోరు!

**కాకతీయ, తెలంగాణ బ్యూరో :**
పేరు వ్యవసాయ భూమి.. రూపం రియల్ ఎస్టేట్ లేఅవుట్! అసలు అనుమతులున్నాయా? భూమి వినియోగానికి నిబంధనలు వర్తిస్తున్నాయా? రహదారులు, స్థలాల విభజనకు ఎవరు అనుమతిచ్చారు? కొనుగోలుదారుల ముందుంచుతున్న పత్రాలు ఎంతవరకు చట్టబద్ధతను నిర్ధారిస్తున్నాయి? ఇలాంటి ప్రశ్నలకు అధికారుల రికార్డులే సమాధానం చెప్పాలి. ప్రకటనల మెరుపుల వెనుక పత్రాల చీకట్లు ఉంటే మాత్రం పెట్టుబడిదారుడి జేబుకే చిల్లు!

**వ్యవసాయ భూమి ముసుగులో రియల్ వ్యాపారం**

వ్యవసాయ భూమిని కొనడం ఒక ఎత్తయితే.. దానిని విభజించి, రహదారులు వేసి, ప్లాట్ల మాదిరిగా విక్రయించడం మరో ఎత్తు. భూమి రిజిస్ట్రేషన్ అయిందంటే అన్ని అనుమతులూ ఉన్నట్లేనని భావించడం పొరపాటే. భూమి యాజమాన్య హక్కులు, భూ వినియోగ స్వరూపం, లేఅవుట్ అనుమతులు, అభివృద్ధి పనులకు వర్తించే నిబంధనలు వేర్వేరుగా పరిశీలించాల్సిందే. వ్యవసాయం పేరుతో భూమిని చూపిస్తూ, కొనుగోలుదారులకు మాత్రం భవిష్యత్తులో ఇంటి స్థలంగా ఉపయోగించుకోవచ్చనే ఆశ కల్పిస్తే అసలు వ్యవహారం ఏమిటో తేలాల్సి ఉంది. వెంచర్ బ్రోచర్‌లో కనిపించే రోడ్లు, ప్లాట్ల హద్దులు, భవిష్యత్తు అభివృద్ధి హామీలకు అధికారిక అనుమతులే గీటురాయి.

........(తరువాయి 2లో)

## రేషన్ బియ్యం రీసైక్లింగ్!



- కరీంనగర్‌లో పీడీఎస్ బియ్యం పక్కదారి
- పేదల బియ్యాన్ని మిల్లింగ్ చేసి మళ్లీ మార్కెట్‌లోకి
- రేషన్ నుంచి రైస్ మిల్లుల దాకా అక్రమ వ్యాపారం
- సబ్సిడీ బియ్యంతో సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులు
- పంపిణీ వ్యవస్థను దెబ్బతీస్తున్న రీసైక్లింగ్ ముఠాలు
- పౌరసరఫరాల నిఘా కళ్లుగప్పి సాగుతున్న దందా

**కాకతీయ, కరీంనగర్ :** పేదల కడుపు నింపాల్సిన రేషన్ బియ్యం అక్రమార్కులకు ఆదాయ వనరుగా మారుతోంది! కరీంనగర్ జిల్లాలో ప్రజా పంపిణీ వ్యవస్థ బియ్యం సేకరణ, మిల్లింగ్, తిరిగి విక్రయాల రూపంలో రీసైక్లింగ్ దందా సాగుతోంది. లబ్ధిదారులకు చేరాల్సిన సబ్సిడీ బియ్యం పక్కదారి పట్టి, మిల్లుల్లో మళ్లీ ప్రాసెసింగ్ అనంతరం సాధారణ బియ్యంగా మార్కెట్‌లోకి చేరుతున్న వ్యవహారం ప్రజా పంపిణీ వ్యవస్థ లక్ష్యాన్నే దెబ్బతీస్తోంది. తక్కువ ధరకు లభించే రేషన్ బియ్యాన్ని సేకరించి, దాని అసలు రూపాన్ని మార్చి వ్యాపార సరుకుగా విక్రయించడం

........(తరువాయి 2లో)

## వరంగల్‌ను ముక్కలు చేశారు

- జిల్లా విభజనతో పదేళ్లుగా ప్రజలకు తిప్పలు
- అశాస్త్రీయ నిర్ణయాలతో చారిత్రక నగర అస్తిత్వానికి దెబ్బ
- ఒకే నగరానికి రెండు జిల్లాల పాలనతో ప్రజలకు ఇబ్బందులు
- డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి ధ్వజం

4



## దేశ ప్రజలు కాంగ్రెస్‌కు మద్దతివ్వాలి

- ఓట్ల తొలగింపుపై ప్రశ్నిస్తే అరెస్టులా?
- మోదీ పాలనలో ప్రజాస్వామ్య హక్కులకు భంగం
- బీసీ రిజర్వేషన్ల కోసం ఢిల్లీ వరకు ఉద్యమం
- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు

3







2

## లేబర్ కార్డుల పేరుతో వసూళ్ల దందా!

- కార్మిక సంక్షేమ పథకాల చుట్టూ దళారుల రాయబేరం
- కార్డు జారీ నుంచి పథకాల దరఖాస్తుల వరకు అదనపు భారం
- ప్రభుత్వ సేవలకు మధ్యవర్తులతోనే మొత్తం వ్యవహారం
- అర్హులైన కార్మికుల అవసరాలే వసూళ్లకు ఆసరా
- ఉమ్మడి వరంగల్‌లో కార్మిక సంక్షేమ వ్యవస్థపై ప్రశ్నలు
- సేవా కేంద్రాల నిర్వహణలో నిబంధనలు బేఖాతరు

## అటవీశాఖలో అక్రమాల పర్వం!

### బదిలీలు, డిప్యూటేషన్లలో పైరవీలు



- అభివృద్ధి పనుల ముసుగులో నిధుల ఖర్చుపై అనుమానాలు
- రికార్డుల్లో ఏముంది.. క్షేత్రస్థాయిలో జరుగుతున్నదేమిటి?
- ఏళ్ల తరబడి ఒకే సీటులో పాతుకుపోతున్న అధికారులు
- పనుల కేటాయింపులు, బిల్లుల చెల్లింపుల్లో అంతుచిక్కని వ్యవహారం
- ఆదిలాబాద్ అటవీశాఖలో తెరవెనుక ఏం జరుగుతోంది?

**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** అడవుల సంరక్షణ మాటున అసలు కథ వేరే నడుస్తోందా? ఆదిలాబాద్ అటవీశాఖలో బదిలీలు, డిప్యూటేషన్లు, అభివృద్ధి పనుల కేటాయింపులు, బిల్లుల చెల్లింపులు, రికార్డుల నిర్వహణ చుట్టూ అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు అధికారులు దీర్ఘకాలంగా ఒకే స్థానంలో కొనసాగుతుండటం, ఇటీవల చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన రికార్డుల వ్యవహారం, ఉద్యోగుల పోస్టింగుల్లో అనుసరిస్తున్న విధానంపై చర్చ జరుగుతోంది. నిబంధనల ప్రకారం సాగాల్సిన పరిపాలనా వ్యవహారాల్లో పారదర్శకత ఎంత? క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులకు, కార్యాలయాల్లో నమోదవుతున్న లెక్కలకు పొంతన ఉందా? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఆదిలాబాద్ జిల్లా అటవీశాఖపై దృష్టి సారించేలా చేసింది. తెర వెనుక వ్యవహారాలు ఎలా ఉన్నాయన్నది సంబంధిత రికార్డుల పరిశీలనతోనే తేలాల్సి ఉంది.

**ఏళ్ల తరబడి ఒకే సీటులో.. అంతర్యమేమిటి?**

ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగుల బదిలీలు సాధారణ పరిపాలనా ప్రక్రియ. అయితే కొందరు అధికారులు, సిబ్బంది దీర్ఘకాలంగా ఒకే స్థానంలో కొనసాగుతున్నప్పుడు వారి పోస్టింగుల

........(తరువాయి 2లో)

## జంతర్ మంతర్ 2.0కు కొత్త నాయకత్వం



- దీప్కే నిర్బంధంలో.. అజింక్య శిందేకు బాధ్యతలు
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా నిరసనలు
- నేతల అరెస్టుపై కేజ్రీవాల్ ఆగ్రహం
- న్యాయవాదుల నిర్బంధంపై సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అభ్యంతరం
- రాళ్ల దాడిలో ఇద్దరు పోలీసులకు గాయాలు

**కాకతీయ, నేషనల్ డెస్క్ :**
కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా తలపెట్టిన జంతర్ మంతర్ 2.0 నిరసనలకు ఇకపై అజింక్య శిందే నాయకత్వం వహిస్తారని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ప్రకటించారు. పోలీసులు తమను నిర్బంధంలో ఉంచినంతకాలం నిరసన కార్యక్రమాలు శిందే నేతృత్వంలో కొనసాగుతాయని శనివారం వెల్లడించారు. తనను పోలీసులు అదుపులోకి తీసుకునే అవకాశం ఉందని ముందే ఊహించి, శుక్రవారం రాత్రే శిందే నాయకత్వం వహిస్తాడని

........(తరువాయి 2లో)

# లేబర్ కార్డుల పేరుతో వసూళ్ల దందా!

**కాకతీయ, హన్మకొండ :** కార్మికుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాల చుట్టూ వసూళ్ల వ్యవహారం నడుస్తోంది. నిర్మాణ రంగ కార్మికుల నమోదు, లేబర్ కార్డుల జారీ, సంక్షేమ పథకాల దరఖాస్తుల ప్రక్రియను ఆసరాగా చేసుకుని మధ్యవర్తులు చక్రం తిప్పుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో సులభంగా పూర్తికావాల్సిన పనులకు కార్మికులు ఇతరులపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. దరఖాస్తు చేయడం నుంచి కార్డు పొందడం, సంక్షేమ ప్రయోజనాలకు దరఖాస్తు చేసుకోవడం వరకు మధ్యవర్తుల ప్రమేయం పెరుగుతోంది. రోజువారీ కూలీపై ఆధారపడే కార్మికులు పనులు మానుకుని కార్యాలయాల చుట్టూ తిరగలేక ఇతరుల సహాయం తీసుకుంటున్నారు. ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని సేవల పేరుతో అదనపు డబ్బులు వసూలు చేసే వ్యవహారం కార్మిక సంక్షేమ పథకాల లక్ష్యాన్ని దెబ్బతీస్తోంది.




**కార్డు కావాలంటే మధ్యవర్తులే దిక్కు**

వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, జనగామ, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల పరిధిలో కార్మికుల నమోదు, కార్డుల జారీ, సంక్షేమ పథకాల దరఖాస్తులు, సేవా కేంద్రాల నిర్వహణ కీలకంగా మారాయి. కార్మికశాఖ పరిధిలోని ప్రక్రియలను పర్యవేక్షించాల్సిన అధికారులు క్షేత్రస్థాయిలో సేవల అమలుపై నిఘా కరువైందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. లేబర్ కార్డు పొందేందుకు అవసరమైన పత్రాలు, దరఖాస్తు విధానం, అర్హతలపై పూర్తి అవగాహన లేని కార్మికులు మధ్యవర్తులను ఆశ్రయిస్తున్నారు. ఆన్‌లైన్ దరఖాస్తులు, పత్రాల సమర్పణ, వివరాల నమోదు వంటి పనులను సాకుగా చేసుకుని కొందరు అదనపు మొత్తాలు వసూలు చేస్తున్నారు. కార్డు త్వరగా ఇప్పిస్తామని, దరఖాస్తు ప్రక్రియను సులభతరం చేస్తామని నమ్మిస్తూ కార్మికుల నుంచి డబ్బులు తీసుకునే వ్యవహారం సాగుతోంది. ప్రభుత్వ సేవలను నేరుగా పొందే అవకాశం ఉన్నా, ప్రక్రియపై అవగాహన లేక కార్మికులు మధ్యవర్తులపై ఆధారపడుతున్నారు. ఫలితంగా ఉచితంగా లేదా నిర్ణీత రుసుముతో అందాల్సిన సేవలకు అదనపు భారం మోయాల్సి వస్తోంది.

**సంక్షేమ పథకాలపైనా వసూళ్ల పంజా**

లేబర్ కార్డుతో అనుసంధానమైన సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందేందుకు కార్మికులు దరఖాస్తు చేసుకుంటున్నారు. వివాహ కానుక, ప్రసూతి ప్రయోజనాలు వంటి పథకాల కోసం అవసరమైన పత్రాల సమర్పణ, దరఖాస్తుల ప్రక్రియలో మధ్యవర్తుల ప్రమేయం పెరిగితే కార్మికులపై ఆర్థిక భారం పడుతోంది. పథకం మంజూరు చేయిస్తామని, దరఖాస్తు త్వరగా పూర్తిచేస్తామని చెప్పి డబ్బులు వసూలు చేసే విధానం కార్మికుల అవసరాలను ఆసరాగా చేసుకుంటోంది. ప్రభుత్వ సంక్షేమం నేరుగా అర్హులకు చేరాల్సి ఉండగా, దరఖాస్తుల ప్రక్రియలో మధ్యవర్తుల జోక్యం కార్మికులకు అదనపు ఖర్చుగా మారుతోంది.

**సేవా కేంద్రాల మాటున వ్యవహారం**

కార్మికుల నమోదు, కార్డుల జారీకి సంబంధించిన ఆన్‌లైన్ సేవలు అందించే కేంద్రాల నిర్వహణ కూడా కీలకంగా మారింది. దరఖాస్తుదారుల నుంచి వసూలు చేస్తున్న మొత్తాలకు రసీదులు ఇస్తున్నారా? అధికారిక రుసుములకు మించి డబ్బులు తీసుకుంటున్నారా? దరఖాస్తుల పరిష్కారంలో జాప్యాన్ని ఆసరాగా చేసుకుని అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారా? అనే అంశాలు ఈ వ్యవహారంలో ప్రధానంగా నిలుస్తున్నాయి. సేవా కేంద్రాల నిర్వహణ, దరఖాస్తుల స్వీకరణ, కార్డుల జారీ ప్రక్రియలో పారదర్శకత లేకపోతే కార్మికులు నష్టపోతున్నారు. అధికారిక ప్రక్రియపై అవగాహన కల్పించాల్సిన వ్యవస్థలోనే మధ్యవర్తులపై ఆధారపడే పరిస్థితి ఏర్పడటం కార్మిక సంక్షేమ అమలులోని లోపాలను ఎత్తిచూపుతోంది.

# దసరా వేళ ఫామ్‌ల్యాండ్ దందా జోరు!

**(మొదటిపేజీ తరువాయి)**

కాగితంపై చూపించిన కలలకు, చట్టబద్ధంగా అనుమతించిన అభివృద్ధికి మధ్య తేడా తెలుసుకోకపోతే కొనుగోలుదారులు నష్టాల ఊబిలో చిక్కుకునే ప్రమాదం ఉంది.

**నాలా అనుమతి ఉంటే.. అంతా ఓకేనా?**

వ్యవసాయ భూమిని వ్యవసాయేతర అవసరాలకు వినియోగించేందుకు వర్తించే సందర్భాల్లో భూ వినియోగ మార్పు ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది. అయితే నాలా అనుమతి ఒక్కటే లేఅవుట్‌కు పూర్తి ఆమోదం కాదు. భూమి ఉన్న ప్రాంతాన్ని బట్టి సంబంధిత పట్టణాభివృద్ధి సంస్థ, పట్టణ, దేశ ప్రణాళికా విభాగం లేదా స్థానిక సంస్థ నుంచి అవసరమైన అనుమతులు ఉన్నాయా లేదా పరిశీలించాలి. అనుమతులు అవసరమైన చోట వాటిని పొందకుండా రహదారులు వేయడం, స్థలాలను విభజించడం జరిగిందా అన్నది రికార్డుల పరిశీలనతో తేలాలి. భూమి రిజిస్ట్రేషన్ పత్రాన్ని చూపించి మిగతా అనుమతులపై ప్రశ్నలకు సమాధానం దాటవేస్తే సరిపోదు. చట్టబద్ధతను నిర్ధారించేది ప్రచార కరపత్రం కాదు.. సంబంధిత శాఖల ఆమోద పత్రాలే.



**ఎల్ఆర్ఎస్ రసీదే ఆమోద పత్రమా?**

అనధికార, అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ కోసం తెలంగాణ ప్రభుత్వం 2020 ఆగస్టు 31న జీవో నంబర్ 131 జారీ చేసింది. ఈ పథకానికి నిర్దిష్ట అర్హతలు, పరిమితులు ఉన్నాయి. దరఖాస్తు చేశామని చెప్పడం, క్రమబద్ధీకరణకు తుది ఆమోదం పొందడం రెండూ ఒకటి కావు. సంబంధిత వెంచర్ పథకానికి అర్హమా? దరఖాస్తుపై తుది ఉత్తర్వు వచ్చిందా? వర్తించే రుసుములు చెల్లించారా? అనే వివరాలు బయటకు రావాలి. ఎల్ఆర్ఎస్ దరఖాస్తు రసీదును చూపిస్తూ వెంచర్ పూర్తిగా చట్టబద్ధమైందనే భావన కల్పిస్తే కొనుగోలుదారులు అప్రమత్తంగా ఉండాలి. ఫామ్‌ల్యాండ్ సహా విక్రయాలు జరుగుతున్న వెంచర్లలో భూమి యాజమాన్య పత్రాలు, సర్వే వివరాలు, భూ వినియోగ అనుమతులు, లేఅవుట్ ఆమోదాలు, రహదారుల నిర్మాణానికి సంబంధించిన రికార్డులను అధికారులు పరిశీలించాలి. ఎన్ని వెంచర్లు ఉన్నాయి? ఎన్ని అనుమతులతో నడుస్తున్నాయి? ఎన్ని చోట్ల స్థలాల విభజన, రహదారుల నిర్మాణం చేపట్టారు? ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిస్థితి ఏమిటి? ప్రభుత్వానికి రావాల్సిన ఫీజులు ఎంత వసూలయ్యాయి? అనే వివరాలను ప్రజలకు వెల్లడించాలి. నిబంధనలకు విరుద్ధంగా అభివృద్ధి పనులు చేపట్టినట్లు తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. అనుమతుల పరిశీలన లేకుండా ప్రచార హోరు సాగితే కొనుగోలుదారులే చివరకు మూల్యం చెల్లించాల్సి వస్తుంది. పండుగ వేళ పెట్టుబడులపై ఆశలు పెరగడం సహజం. కానీ ఆశకు ఆశ్రయం పత్రాలే కావాలి. వెంచర్ ప్రకటన చూసి అడుగు వేయడం కంటే, అనుమతుల రికార్డులు చూసి నిర్ణయం తీసుకోవడం మేలు. ఫామ్‌ల్యాండ్ పేరుతో సాగుతున్న ప్రతి విక్రయమూ అక్రమమని ముందే తేల్చలేం.. కానీ అనుమతులున్నాయో లేదో తేల్చకుండా వదిలేయడమూ కుదరదు. రెవెన్యూ, ప్రణాళికా సంస్థలు సమన్వయంతో తనిఖీలు చేపట్టి వాస్తవాలను బయటపెట్టాలి. లేదంటే పండుగ పూట చూపించిన పచ్చని కలలు, కొనుగోలుదారులకు తర్వాత కంటిమీద కునుకు లేకుండా చేసే పరిస్థితి ఏర్పడొచ్చు.

# జంతర్ మంతర్ 2.0కు కొత్త నాయకత్వం

**(మొదటిపేజీ తరువాయి)**

తెలియజేస్తూ వీడియో రికార్డు చేసినట్లు దీప్కే ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. ముంబయి నుంచి ఢిల్లీలోని జంతర్ మంతర్‌కు వెళ్తున్న అభిజీత్ దీప్కేను శనివారం విమానంలోనే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆయనతోపాటు సీజేపీ నేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రంకాను కూడా నిర్బంధంలోకి తీసుకున్నట్లు సమాచారం. అనంతరం వారిని విమానాశ్రయం నుంచి అజ్ఞాత ప్రాంతానికి తరలించినట్లు కథనంలో పేర్కొన్నారు. పోలీసుల చర్యలతో నిరసనలకు నాయకత్వం వహించే బాధ్యతలను శిందేకు అప్పగిస్తున్నట్లు దీప్కే స్పష్టం చేశారు.

**మోదీ ప్రభుత్వంపై కేజ్రీవాల్ విమర్శలు**

సీజేపీ నేతల నిర్బంధంపై ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ తీవ్రంగా స్పందించారు. నిరసనలను అణచివేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఎమర్జెన్సీని తలపించే చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. ప్రధాని మోదీపై తీవ్ర వ్యాఖ్యలు చేస్తూ, ప్రజాస్వామ్యాన్ని అణచివేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఎక్స్‌లో పోస్టు చేశారు. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ పదవి నుంచి వైదొలగాలని, ప్రధాని మోదీ కూడా తప్పుకోవాలని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు ప్రాంగణంలో సీజేపీకి మద్దతుగా శాంతియుత నిరసన చేపట్టిన న్యాయవాదులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారన్న వార్తలపై సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ స్పందించింది. పోలీసుల బలప్రయోగంపై వచ్చిన వార్తల నేపథ్యంలో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ జోక్యం చేసుకోవాలని అసోసియేషన్ గౌరవ కార్యదర్శి ప్రజ్ఞా బఘేల్ కోరారు. నిర్బంధంలో ఉన్న న్యాయవాదుల ఆచూకీ, భద్రతను నిర్ధారించాలని, వారికి న్యాయసహాయం అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. చట్టబద్ధమైన కారణాలు లేని నిర్బంధాలను తొలగించాలని, బలప్రయోగం జరిగి ఉంటే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు.

**రాళ్ల దాడిలో ఇద్దరు పోలీసులకు గాయాలు**

మరోవైపు ఢిల్లీలోని ఆకాశవాణి భవన్ సమీపంలో ఇంతియాజ్ అలీ మార్గ్ వద్ద బారికేడ్లను దాటి వచ్చిన 25 నుంచి 30 మంది నిరసనకారులు భద్రతా సిబ్బందిపై రాళ్లతో దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో ఇద్దరు పోలీసులు గాయపడగా, కొందరిని అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. జంతర్ మంతర్ వద్ద నిరసనలకు పోలీసులు అనుమతి నిరాకరించడంతోపాటు భద్రతను కట్టుదిట్టం చేశారు. ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా 500 మందిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అయినప్పటికీ పలువురు వేర్వేరు ప్రాంతాల నుంచి నిరసన స్థలానికి చేరుకునేందుకు ప్రయత్నించగా, కొందరిని అదుపులోకి తీసుకుని మరికొందరిని వెనక్కి పంపించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా పరిస్థితులను పర్యవేక్షిస్తున్నట్లు కథనంలో పేర్కొన్నారు.

# కేసీఆర్ కృషితోనే మానుకోట జిల్లా ఆవిర్భావం

- జిల్లా ఏర్పాటుతో పాలన ప్రజలకు చేరువ
- వైద్య, విద్యారంగాల్లో కీలక మార్పులు
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

**కాకతీయ, మహబూబాబాద్ :** కేసీఆర్ కృషితోనే మహబూబాబాద్ జిల్లా ఏర్పాటైందని, పదేళ్లలో పాలన, వైద్యం, విద్యారంగాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. జిల్లా ఆవిర్భవించి 10 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శనివారం మహబూబాబాద్ కలెక్టరేట్ వద్ద మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉన్నప్పుడు మానుకోట ప్రజలు జిల్లా కేంద్రానికి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడేవారని, జిల్లాల పునర్విభజనతో ఆ సమస్యకు పరిష్కారం లభించిందని పేర్కొన్నారు. 2016 అక్టోబర్ 11న మహబూబాబాద్ జిల్లా ఏర్పడిందని, ప్రజలకు పాలనను చేరువ చేయడమే లక్ష్యంగా జిల్లాల పునర్విభజన చేపట్టారని ఎర్రబెల్లి అన్నారు. జిల్లా పరిధిలోని తొర్రూరును రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయడంతోపాటు గిరిజన తండాలను కొత్త గ్రామ పంచాయతీలుగా మార్చి స్థానిక పాలనను సులభతరం చేశారని వివరించారు.



**వైద్యం, విద్యకు ప్రాధాన్యం**

జిల్లా ఏర్పాటైన తర్వాత ఆధునిక కలెక్టరేట్ భవనం, వైద్య కళాశాల, ఎస్పీ కార్యాలయం, నర్సింగ్ కళాశాల, ఉద్యానవన కళాశాల వంటి సంస్థలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. గతంలో గిరిజన తండాలకు వెళ్లేందుకు సరైన రహదారులు లేక ప్రజలు ఇబ్బందులు పడేవారని, రహదారుల నిర్మాణం, మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరా, గ్రామాల అభివృద్ధికి చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. గిరిజనులకు రిజర్వేషన్లను 6 శాతం నుంచి 10 శాతానికి పెంచి ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యాసంస్థల్లో ప్రవేశాలకు వర్తింపజేసినట్లు ఎర్రబెల్లి తెలిపారు. ఈ కార్యక్రమంలో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, రెడ్యా నాయక్, మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్, మాజీ ఎంపీ మాలోత్ కవిత, మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, మాజీ జెడ్పీ చైర్మన్ బిందు తదితరులు పాల్గొన్నారు.

# అటవీశాఖలో అక్రమాల పర్వం!

**(మొదటిపేజీ తరువాయి)**

వెనుక ఉన్న కారణాలు సహజంగానే చర్చకు వస్తాయి. అటవీశాఖలోనూ ఇదే పరిస్థితి ఉందా? బదిలీలకు సంబంధించిన మార్గదర్శకాలు అమలవుతున్నాయా? ఎవరెవరు ఎన్నేళ్లుగా ఒకే కార్యాలయం, ఒకే స్థానంలో విధులు నిర్వహిస్తున్నారు? బదిలీ ఉత్తర్వులు వెలువడినా అమలు కాని సందర్భాలున్నాయా? డిప్యూటేషన్ల పేరుతో స్థాన మార్పులు జరుగుతున్నాయా? అనే అంశాలపై స్పష్టత అవసరమవుతోంది. ఒకే చోట దీర్ఘకాలం కొనసాగుతున్న అధికారులు కీలక రికార్డులు, పనుల కేటాయింపులు, స్థానిక వ్యవహారాలపై పట్టు సాధించే అవకాశం ఉంటుంది.

**అభివృద్ధి పనుల లెక్కలు తేలేనా?**

ఇటీవలి కాలంలో అటవీశాఖ పరిధిలో చేపట్టిన అభివృద్ధి, సంరక్షణ పనులకు సంబంధించిన నిధుల వినియోగంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పనుల అంచనాలు, మంజూరైన నిధులు, టెండర్లు, పనుల కేటాయింపులు, కొలతల పుస్తకాలు, బిల్లుల చెల్లింపుల మధ్య పొంతన ఉందా అన్నది కీలకం. కాగితాలపై నమోదైన పనులు క్షేత్రస్థాయిలో అదే స్థాయిలో పూర్తయ్యాయా? పనుల నాణ్యతను ఎవరు ధ్రువీకరించారు? తుది బిల్లుల చెల్లింపులకు ముందు తనిఖీలు జరిగాయా? అనే అంశాలు రికార్డుల పరిశీలన కోరుతున్నాయి. మొక్కల పెంపకం, నర్సరీల నిర్వహణ, కందకాల తవ్వకం, కంచెల ఏర్పాటు వంటి పనులకు ఖర్చు చేసిన నిధులకు సంబంధించిన లెక్కలు బయటకు వస్తేనే వాస్తవ పరిస్థితి స్పష్టమవుతుంది. పనుల కేటాయింపుల నుంచి బిల్లుల ఆమోదం వరకు ఒకే వర్గం అధికారుల ప్రమేయం ఎంతవరకు ఉందన్నది తేలాల్సి ఉంది.

**రికార్డుల్లో ఒకటి..**

**క్షేత్రస్థాయిలో మరొకటా?**

ప్రభుత్వ శాఖల్లో రికార్డులే పరిపాలనా వ్యవహారాలకు ఆధారం. అటవీశాఖలోనూ పనుల కొలతలు, తనిఖీ నివేదికలు, నిధుల వినియోగం, బిల్లుల ఆమోదం, ఉద్యోగుల బదిలీలకు సంబంధించిన పత్రాలు కీలకమైనవి. ఈ రికార్డుల్లో నమోదైన వివరాలు వాస్తవ పరిస్థితులకు సరిపోతున్నాయా? పనులు పూర్తయినట్లు చూపిన చోట క్షేత్రస్థాయిలో పరిస్థితి ఏమిటి? బిల్లుల ఆమోదానికి సంబంధించిన ధ్రువీకరణలు నిబంధనల ప్రకారం ఉన్నాయా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రికార్డుల నిర్వహణలో పారదర్శకత లేకపోతే నిధుల వినియోగంపై అనుమానాలు మరింత పెరుగుతాయి. ముఖ్యంగా ఒకే స్థానంలో దీర్ఘకాలంగా కొనసాగుతున్న అధికారుల పరిధిలో కీలక నిర్ణయాలు, పనుల కేటాయింపులు కేంద్రీకృతమయ్యాయా అన్నది పరిశీలించాల్సిన అవసరం ఉంది.

**బదిలీలు.. డిప్యూటేషన్లలో ఏం జరుగుతోంది?**

ఉద్యోగుల బదిలీలు, డిప్యూటేషన్ల విషయంలో అనుసరిస్తున్న విధానంపైనా ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఎవరికి ఏ ప్రాతిపదికన పోస్టింగ్ ఇచ్చారు? ఒకే స్థానంలో కొనసాగుతున్నవారికి మళ్లీ అదే బాధ్యతలు ఎలా దక్కుతున్నాయి? డిప్యూటేషన్ ఉత్తర్వులకు ఆధారాలేమిటి? బదిలీ మార్గదర్శకాలకు మినహాయింపులు ఇచ్చిన సందర్భాలున్నాయా? అన్న వివరాలు వెలుగులోకి రావాల్సి ఉంది. బదిలీల్లో పైరవీలు జరుగుతున్నాయన్న అనుమానాలు ఉంటే వాటిని ఉత్తర్వులు, దరఖాస్తులు, సిఫారసులు, ఆమోద పత్రాల ఆధారంగా పరిశీలించాలి. ఈ వ్యవహారాల్లో పారదర్శకతపై స్పష్టమైన సమాచారం లేకపోవడంతో ఉద్యోగుల పోస్టింగుల చుట్టూ చర్చ కొనసాగుతోంది. అటవీశాఖలో బదిలీలు, డిప్యూటేషన్లు, దీర్ఘకాలిక పోస్టింగులు, అభివృద్ధి పనులు, బిల్లుల చెల్లింపులకు సంబంధించిన వ్యవహారాలపై సమగ్ర పరిశీలన జరిగితేనే అసలు పరిస్థితి బయటపడుతుంది. ఆదిలాబాద్ జిల్లాలో గత మూడేళ్లలో చేపట్టిన పనులు, మంజూరైన నిధులు, చెల్లించిన బిల్లులు, తనిఖీ నివేదికలు, ఉద్యోగుల బదిలీ ఉత్తర్వులు, డిప్యూటేషన్ వివరాలు కీలకంగా మారనున్నాయి. రికార్డుల్లో తేడాలు, నిబంధనల ఉల్లంఘనలు లేదా నిధుల దుర్వినియోగం ఉన్నట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం బయటకు వస్తున్న సందేహాలకు అధికారిక వివరణ రావాల్సి ఉంది. అడవులను కాపాడాల్సిన శాఖలో పరిపాలనా వ్యవహారాలపైనే అనుమానాలు పెరగడం ఆందోళనకరం. అసలు లెక్కలు బయటపెడితేనే వ్యవహారాల వెనుక ఉన్న వాస్తవాలు వెలుగులోకి వస్తాయి.

# రేషన్ బియ్యం రీసైక్లింగ్!



**(మొదటిపేజీ తరువాయి)**

ద్వారా అక్రమార్కులు లాభాలు ఆర్జిస్తున్నారు. పేదలకు అందాల్సిన బియ్యంపై సాగుతున్న ఈ వ్యాపారం వెనుక సేకరణదారులు, రవాణాదారులు, నిల్వ కేంద్రాలు, మిల్లుల మధ్య సంబంధాలు కీలకంగా మారాయి.

**రేషన్ బియ్యం.. మిల్లుల్లో మాయ**

రేషన్ దుకాణాల ద్వారా లబ్ధిదారులకు చేరాల్సిన బియ్యం బయటకు వచ్చి వ్యాపారుల చేతుల్లోకి చేరుతోంది. అక్కడి నుంచి నిల్వ కేంద్రాలకు, రైస్ మిల్లులకు తరలించి మిల్లింగ్ చేయడం ద్వారా సాధారణ బియ్యం రూపంలో మార్కెట్‌లోకి పంపే విధానం రీసైక్లింగ్ దందాలో కీలకంగా మారుతోంది. బియ్యం మూలాలను గుర్తించడం కష్టమయ్యేలా మిల్లింగ్ ప్రక్రియను ఉపయోగించుకుంటూ అక్రమ వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. రేషన్ బియ్యం సేకరణ నుంచి తుది విక్రయం వరకు ప్రతి దశలో లాభాలే లక్ష్యంగా ఈ వ్యవహారం సాగుతోంది. పేదల కోసం కేటాయించిన బియ్యం వ్యాపార సరుకుగా మారడం ప్రజా పంపిణీ వ్యవస్థలోని లోపాలను ఎత్తిచూపుతోంది.

**సబ్సిడీ బియ్యంతో లాభాల వేట**

ప్రభుత్వం పేదలకు అందించే బియ్యం వెనుక ప్రజాధనం ఉంది. లబ్ధిదారులకు చేరాల్సిన బియ్యం అక్రమ వ్యాపారంలోకి మళ్లితే సబ్సిడీ ప్రయోజనం పేదలకు కాకుండా దళారులకు చేరుతుంది. రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు సేకరించి, మిల్లింగ్ అనంతరం సాధారణ బియ్యంగా విక్రయించడం ద్వారా ధరలోని వ్యత్యాసాన్ని లాభంగా మార్చుకుంటున్నారు. ఈ వ్యవహారంలో అక్రమ రవాణా, నిల్వలు, మిల్లింగ్, మార్కెట్ సరఫరా కీలక పాత్ర పోషిస్తున్నాయి. బియ్యం ఎక్కడి నుంచి వచ్చింది, ఎక్కడ నిల్వ చేశారు, ఏ మిల్లులో ప్రాసెస్ చేశారు, చివరకు ఎవరికి విక్రయించారు అనే సరఫరా గొలుసే ఈ దందాకు కేంద్రంగా మారుతోంది. రేషన్ బియ్యం అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన పౌరసరఫరాల వ్యవస్థ, నిల్వ కేంద్రాల పర్యవేక్షణ, రవాణా తనిఖీలు, మిల్లుల తనిఖీల మధ్య సమన్వయం కీలకం. అయినప్పటికీ రేషన్ బియ్యం వ్యాపార సరుకుగా మారుతున్న వ్యవహారం నియంత్రణ వ్యవస్థ పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. బియ్యం నిల్వలు, రవాణా పత్రాలు, మిల్లింగ్ వివరాలు, విక్రయ రికార్డుల మధ్య తేడాలు ఈ తరహా అక్రమాలకు అవకాశం కల్పిస్తున్నాయి. రేషన్ బియ్యం పట్టుబడిన సందర్భాల్లో సరుకును స్వాధీనం చేసుకోవడానికే పరిమితమైతే సరఫరా గొలుసులోని అసలు నిర్వాహకులు తప్పించుకునే ప్రమాదం ఉంది. దందా వెనుక ఉన్న వ్యక్తులు, నిల్వ కేంద్రాలు, మిల్లుల మధ్య సంబంధాలను ఛేదించడమే అక్రమ వ్యాపారానికి అడ్డుకట్ట వేయగలదు.

**పేదల బియ్యంపై వ్యాపారుల కన్ను**

రేషన్ బియ్యం రీసైక్లింగ్ కేవలం అక్రమ రవాణా వ్యవహారం కాదు. ప్రజల కోసం కేటాయించిన ఆహార ధాన్యాలను వాణిజ్య లాభాల కోసం మళ్లించే చర్య. లబ్ధిదారుల హక్కును దెబ్బతీస్తూ ప్రభుత్వ సబ్సిడీని అక్రమార్కుల ఆదాయంగా మార్చే ఈ వ్యవహారం ప్రజా పంపిణీ వ్యవస్థ విశ్వసనీయతకు విఘాతం కలిగిస్తోంది. కరీంనగర్ జిల్లాలో రేషన్ బియ్యం సేకరణ, రవాణా, మిల్లింగ్, విక్రయాలపై నమోదైన కేసులు, పట్టుబడిన నిల్వలు, సంబంధిత మిల్లుల వివరాలు ఈ దందా విస్తృతిని నిర్ధారించే కీలక ఆధారాలు. అక్రమ రీసైక్లింగ్‌లో భాగస్వాములైన వారిపై కఠిన చర్యలు తీసుకున్నప్పుడే పేదల బియ్యానికి రక్షణ లభిస్తుంది.

# పెద్దపల్లిలో గాడి తప్పిన టౌన్ ప్లానింగ్!

- అనుమతులు ఒకలా.. నిర్మాణాలు మరోలా?
- పార్కింగ్ స్థలాల్లో వాణిజ్య కార్యకలాపాలు
- నిబంధనల అమలుపై పర్యవేక్షణ కరవు
- భవన నిర్మాణాలపై తనిఖీలు ఏవీ?
- అనుమతులు, ఉల్లంఘనల లెక్కలు బయటపెట్టని అధికారులు
- పెద్దపల్లి పట్టణంలో టౌన్ ప్లానింగ్ విభాగం పనితీరుపై చర్చ

**కాకతీయ, పెద్దపల్లి :** పట్టణంలో భవన నిర్మాణాలు, వాటి వినియోగం, పార్కింగ్ వసతుల నిర్వహణలో టౌన్ ప్లానింగ్ నిబంధనల అమలుపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. భవన నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేసే అధికారులు.. క్షేత్రస్థాయిలో అవి నిబంధనలకు అనుగుణంగా సాగుతున్నాయా లేదా అన్నది పరిశీలించాల్సి ఉంటుంది. అనుమతించిన నిర్మాణ విస్తీర్ణం, అంతస్తులు, భవనం వినియోగం, వాహనాల పార్కింగ్‌కు కేటాయించిన స్థలాలను పరిశీలించడం ఈ విభాగం విధుల్లో భాగం. అయితే పట్టణంలో నిర్మాణాల పర్యవేక్షణ, ఉల్లంఘనల గుర్తింపు, చర్యల వివరాలపై స్పష్టత కొరవడింది. భవన నిర్మాణ అనుమతుల్లో పార్కింగ్‌కు కేటాయించిన స్థలాలను వాహనాల నిలిపేందుకు వినియోగించాలి. వాటిని ఇతర అవసరాలకు మళ్లిస్తే వాహనాలు రహదారులపై నిలిపే పరిస్థితి ఏర్పడుతుంది. దీంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతాయి.

### న్యాయస్థానం దాకా భవన అనుమతుల వివాదం

పెద్దపల్లి మున్సిపల్ పరిధిలో పాఠశాల భవన నిర్మాణ అనుమతికి సంబంధించి 2025లో తెలంగాణ ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించిన ఉదంతం ఉంది. ఈ వ్యవహారంలో అభ్యంతరాలను పునఃపరిశీలించాలని న్యాయస్థానం ఆదేశించింది. భవన నిర్మాణ అనుమతుల విషయంలో అభ్యంతరాల పరిశీలన, సంబంధిత రికార్డుల నిర్వహణ ప్రాధాన్యాన్ని ఈ ఉదంతం వెల్లడిస్తోంది. అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టినా, పార్కింగ్ స్థలాలను ఇతర అవసరాలకు వినియోగించినా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఇందుకోసం మున్సిపల్ అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి, ఉల్లంఘనలను గుర్తించాలి. పెద్దపల్లి పట్టణంలో ఎన్ని భవనాలకు అనుమతులు ఇచ్చారు? ఎన్ని నిర్మాణాలను తనిఖీ చేశారు? ఉల్లంఘనలపై ఎన్ని నోటీసులు జారీ చేశారు? ఎన్ని కేసుల్లో చర్యలు తీసుకున్నారు? అనే వివరాలు అందుబాటులోకి రావాల్సి ఉంది. భవన అనుమతులు, తనిఖీలు, ఉల్లంఘనలపై మున్సిపల్ యంత్రాంగం నిర్వహిస్తున్న రికార్డుల ఆధారంగా టౌన్ ప్లానింగ్ విభాగం పనితీరుపై స్పష్టత రానుంది.



# పూలలో ప్రకృతి పరిమళం.. పాటలో తెలంగాణ ప్రాణం!



(మొదటిపేజీ తరువాయి)

తొలిరోజైన ఎంగిలిపూల బతుకమ్మను మహిళలు సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. అందుబాటులోని తీరొక్క పూలను సేకరించి, వాటిని వరుసలుగా పేర్చి అందమైన బతుకమ్మలను రూపొందించారు. పూల మధ్య గౌరమ్మను అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. సాయంత్రం మహిళలంతా ఒకచోట చేరి బతుకమ్మలను కొలువుదీర్చారు. వాటి చుట్టూ తిరుగుతూ చప్పట్లు కొడుతూ ఉయ్యాల పాటలతో సందడి చేశారు. బతుకమ్మ పండుగ కేవలం పూలతో అలంకరించే వేడుక మాత్రమే కాదు. ప్రకృతితో మమేకమై, సంప్రదాయాలను తరువాతి తరాలకు అందించే సాంస్కృతిక ఉత్సవం. పూలకు ప్రత్యేక స్థానం కల్పిస్తూ, మహిళల ఐక్యతను చాటుతూ, తెలంగాణ జీవనశైలిని ప్రతిబింబించే ఈ పండుగకు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉంది. పండుగ ప్రారంభంతోనే ఇళ్లలో, వీధుల్లో సందడి నెలకొంది.

**వేయి స్తంభాల ఆలయంలో పూల సందడి**

హనుమకొండలోని చారిత్రక వేయి స్తంభాల ఆలయంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలను చేతబూని మహిళలు ఆలయానికి పెద్దఎత్తున తరలివచ్చారు. సంప్రదాయ దుస్తుల్లో వచ్చిన మహిళలతో ఆలయ ప్రాంగణం కళకళలాడింది. బతుకమ్మలను ఒకచోట కొలువుదీర్చి వాటి చుట్టూ చేరి పాటలు పాడుతూ, చప్పట్లు కొడుతూ సంబురాలు చేసుకున్నారు. బతుకమ్మ పాటల్లో వినిపించే జానపద పదాలు, మహిళల గొంతుల్లో పలికే ఆత్మీయత పండుగకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చారిత్రక ఆలయ ప్రాంగణంలో పూల సోయగాలు, సంప్రదాయ గీతాలు కలగలిసి పండుగ వాతావరణాన్ని మరింత శోభాయమానం చేశాయి. తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలు నగర ప్రజలను ఆకట్టుకున్నాయి.

**తెలంగాణ అస్తిత్వానికి ప్రతీకగా బతుకమ్మ**

తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ఆరాధనకు, ప్రాంతీయ అస్తిత్వానికి బతుకమ్మ ప్రతీకగా నిలుస్తోంది. పూలను పేర్చే ప్రతి చేతిలో సృజనాత్మకత.. గౌరమ్మను కొలిచే ప్రతి మనసులో భక్తి.. ఉయ్యాల పాటలో వినిపించే ప్రతి స్వరంలో తెలంగాణ నేలపై మమకారం కనిపిస్తాయి. తరతరాలుగా వస్తున్న ఈ సంప్రదాయం కుటుంబాలను, సమాజాన్ని ఒక్కచోట చేర్చుతోంది. ఎంగిలి పూల బతుకమ్మతో మొదలైన ఈ పూల పండుగ రానున్న రోజుల్లో మరింత ఉత్సాహంగా కొనసాగనుంది. పూల పరిమళాలు, జానపద గీతాలు, మహిళల కోలాహలంతో తెలంగాణవ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొంది.













## దుగ్గొండి లో ఘనంగా ఎంగిలి పూల బతుకమ్మ వేడుకలు

**కాకతీయ దుగ్గొండి:** తెలంగాణ పూల పండుగ బతుకమ్మ ఎంగిలి పూల పండుగ దుగ్గొండి మండల కేంద్రంలో ఘనంగా నిర్వహిచారు. ఈ సందర్బంగా మహిళలు, యువతులు బతుకమ్మలతో బొడ్రాయి సెంటర్లో బతుకమ్మ పాటలకు నృత్యాలు చేస్తూ సందడి చేశారు.. ఈ సందర్బంగా గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేసినట్లు సర్పంచ్ కామిశెట్టి ప్రశాంత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు యువకులు పాల్గొన్నారు.



### నెక్లెస్ రోడ్డులోనూ సంబురాలు

హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్డులోనూ బతుకమ్మ వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. మహిళలు బతుకమ్మలను పేర్చి సంప్రదాయబద్ధంగా పండుగలో పాల్గొన్నారు. నగర వాతావరణంలోనూ తెలంగాణ పల్లె సంస్కృతి, జానపద సంప్రదాయాలు ప్రతిబింబించాయి. బతుకమ్మల చుట్టూ చేరి పాటలు పాడుతూ మహిళలు సందడి చేశారు. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖలతోపాటు జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో సద్దుల బతుకమ్మ ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేపట్టారు. పండుగను ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా బతుకమ్మ వేడుకలు ప్రారంభం కావడంతో పూలకు గిరాకీ పెరగడంతోపాటు పండుగ సందడి ఊపందుకుంది.



# దేశ ప్రజలు కాంగ్రెస్‌కు మద్దతివ్వాలి

- ఓట్ల తొలగింపుపై ప్రశ్నిస్తే అరెస్టులా?
- మోదీ పాలనలో ప్రజాస్వామ్య హక్కులకు భంగం
- బీసీ రిజర్వేషన్ల కోసం ఢిల్లీ వరకు ఉద్యమం
- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు




**కాకతీయ, హైదరాబాద్ :** రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును పరిరక్షించేందుకు పోరాడుతున్న కాంగ్రెస్ పార్టీకి ప్రజలు మద్దతు ఇవ్వాలని వి.హెచ్. పిలుపునిచ్చారు. ఓట్ల తొలగింపుపై ప్రశ్నిస్తూ ఎన్నికల సంఘాన్ని నిలదీస్తున్న రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలకు ప్రజలు అండగా నిలవాలని కోరారు. శనివారం గాంధీభవన్‌లో హనుమంతరావు విలేకరులతో మాట్లాడారు. దేశంలో ఇంతటి నియంతృత్వ పాలనను ఎక్కడా చూడలేదని కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు చేశారు. ఢిల్లీలో గత 4 రోజులుగా చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీనామా చేయాలని రాహుల్ గాంధీ నాయకత్వంలో ఉద్యమాలు జరుగుతున్నాయని తెలిపారు. 13 కోట్ల ఓట్లను రద్దు చేశారని ఆరోపిస్తూ, ఈ అంశంపై ఎన్నికల కమిషనర్‌ను కలవడానికి ప్రయత్నించినా అవకాశం కల్పించలేదని పేర్కొన్నారు. ఓట్ల తొలగింపుపై సవరణలు చేయాలని కోరితే అరెస్టులకు పాల్పడుతున్నారని, కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉన్న వారి ఓట్లను తొలగిస్తున్నారని ఆరోపించారు. ఎంపీలతో పాటు జనతాదళ్ పార్టీ నాయకులను కూడా అరెస్టు చేశారని వి.హెచ్. అన్నారు. రైళ్లలో ప్రయాణిస్తున్న వారిని సైతం అరెస్టు చేస్తున్నారని విమర్శించారు. గతంలో ఎమర్జెన్సీ సమయంలో ఇందిరా గాంధీని అప్రతిష్ఠపాలు చేశారని, ప్రస్తుతం ప్రధానమంత్రి మోదీ అంతకంటే ఘోరంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. నాలుగోసారి అధికారంలోకి రావాలనే లక్ష్యంతో మోదీ నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో రాజ్యాంగబద్ధంగా రిజర్వేషన్లు కల్పించేందుకు చంద్రబాబు నాయుడు కృషి చేయాలని వి.హెచ్. కోరారు. ఎన్టీఆర్ బీసీల అభ్యున్నతి కోసం పనిచేశారని, ప్రస్తుతం చంద్రబాబు నాయుడు బీసీలకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. కేంద్రంలో చంద్రబాబు పార్టీ మద్దతుతోనే మోదీ ప్రభుత్వం కొనసాగుతోందని, ఈ నేపథ్యంలో బీసీలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 100 రోజుల పాటు బీసీ ఉద్యమం కొనసాగుతుందని తెలిపారు. ఓబీసీ ఉద్యమాన్ని ఢిల్లీ వరకు తీసుకెళ్తామని ప్రకటించారు. భావితరాల భవిష్యత్తు కోసం బీసీలు అవసరమైతే ప్రాణత్యాగానికైనా సిద్ధమై రిజర్వేషన్లు సాధించాలని, ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని వి.హెచ్. పిలుపునిచ్చారు.

# కమిషనరేట్‌లో 35 మంది ఎస్సైలకు స్థానచలనం

**పోలీస్ కమిషనర్ శ్వేత ఉత్తర్వులు జారీ**

**కాకతీయ, వరంగల్ బ్యూరో :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 35 మంది సబ్ఇన్‌స్పెక్టర్లకు (ఎస్సైలు) స్థానచలనం కలిగింది. పరిపాలనా సౌలభ్యం, విధుల నిర్వహణలో సమన్వయం కోసం వివిధ పోలీస్ స్టేషన్లు, విభాగాల్లో పనిచేస్తున్న ఎస్సైలను బదిలీ చేస్తూ పోలీస్ కమిషనర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీలు తక్షణమే అమల్లోకి వస్తాయని, సంబంధిత అధికారులు ఎస్సైలను వెంటనే రిలీవ్ చేసి కొత్త స్థానాల్లో విధుల్లో చేరేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బండి శ్రవణ్‌కుమార్‌ను లింగాల ఘన్‌పూర్ నుంచి చిల్పూర్‌కు, సిరిపురం నవీన్‌కుమార్‌ను చిల్పూర్ నుంచి హనుమకొండకు, కత్తి కిషోర్‌ను హనుమకొండ నుంచి లింగాల ఘన్‌పూర్‌కు బదిలీ చేశారు. చింత రాజును కొడకండ్ల నుంచి దేవరుప్పులకు, ఉర సృజన్‌కుమార్‌ను దేవరుప్పుల నుంచి పాలకుర్తికి, డి. పవన్‌కుమార్‌ను పాలకుర్తి నుంచి ధర్మసాగర్‌కు, దూడిమెట్ల నరేష్‌ను రఘునాథపల్లి నుంచి వెలేరుకు పంపించారు. మాశిరెడ్డి మహేందర్‌ను వరంగల్ వీఆర్ నుంచి దుగ్గొండికి, రావుల రణధీర్‌ను దుగ్గొండి నుంచి పరకాలకు, చాగర్ల రఘుపతిని పరకాల నుంచి నర్మెట్టకు, నైనాల నాగభూషణం అలియాస్ నాగేష్‌ను నర్మెట్ట నుంచి వరంగల్ సీసీఎస్‌కు మార్చారు.

**పలు ప్రాంతాలకు కొత్త పోస్టింగ్‌లు**

బొల్లం వినయ్‌కుమార్‌ను ఘన్‌పూర్ (వరంగల్) నుంచి జఫర్‌గఢ్‌కు, బత్తుల రామారావును జఫర్‌గఢ్ నుంచి మడికొండకు, పెగడ రాజ్‌కుమార్‌ను మడికొండ నుంచి పర్వతగిరికి, బోగం ప్రవీణ్‌ను పర్వతగిరి నుంచి వర్ధన్నపేటకు, ఎన్. సాయిబాబును వర్ధన్నపేట నుంచి మిల్స్ కాలనీకి, జలగం శ్రవణ్‌కుమార్‌ను మిల్స్ కాలనీ నుంచి నెక్కొండకు బదిలీ చేశారు. గొల్లపల్లి దివ్యను వంగర నుంచి హనుమకొండకు, ఎం. రాజును వర్ధన్నపేట నుంచి వంగరకు, గూడ అరుణ్‌ను నర్సంపేట నుంచి ఘన్‌పూర్ (వరంగల్)కు పంపించారు. పొన్నాల గోవర్ధన్‌ను హసన్‌పర్తి నుంచి చెన్నారావుపేటకు, జి. రాజేష్‌రెడ్డిని చెన్నారావుపేట నుంచి వరంగల్ సీసీఎస్‌కు బదిలీ చేసి మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్‌కు అనుబంధంగా నియమించారు. లింగాల దిలీప్‌ను ధర్మసాగర్ నుంచి ఇంతేజార్‌గంజ్‌కు మార్చి ఎనుమాముల పోలీస్ స్టేషన్‌కు అనుబంధంగా నియమించారు.

**ప్రత్యేక విభాగాల్లోనూ బదిలీలు**

మొదుగు భరత్‌ను జనగామ నుంచి రఘునాథపల్లికి, కోట సతీష్‌ను హనుమకొండ నుంచి సుబేదారికి, తాళ్లపల్లి సుమన్‌ను సుబేదారి నుంచి జనగామకు, కున్సోత్ కుమార్‌ను గీసుకొండ నుంచి మట్వాడకు, శీలం రవిని హసన్‌పర్తి నుంచి మిల్స్ కాలనీకి, జక్కుల రాజబాబును మడికొండ నుంచి మిల్స్ కాలనీకి, డి. నిహారికను మిల్స్ కాలనీ నుంచి నర్సంపేటకు బదిలీ చేశారు. మారెపల్లి రాజును వరంగల్ వీఆర్ నుంచి వరంగల్ సీఎస్‌బీకి, డి. దేవేందర్‌ను హసన్‌పర్తి నుంచి వరంగల్ సీటీసీకి, డి. విజయ్‌కుమార్‌ను వరంగల్ ట్రాఫిక్ నుంచి సీటీసీకి, ఎం. సతీష్‌ను సుబేదారి నుంచి వరంగల్ సీసీఆర్‌బీకి, ఎ. సురేష్‌ను వెలేరు నుంచి వరంగల్ వీఆర్‌కు మార్చారు. కొత్త పోస్టింగ్‌లలో చేరిన తేదీని పోలీస్ కమిషనర్ కార్యాలయానికి తెలియజేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# విజయ డెయిరీ అభివృద్ధికి రూ.1.85 కోట్ల నిధులు

- తొలి విడతలో రూ.89.50 లక్షలు మంజూరు
- నేటి నుంచి ప్యాకింగ్ కార్యకలాపాలు తాత్కాలికంగా నిలిపివేత
- వినియోగదారులకు పాలు, పాల పదార్థాలు నిరంతర సరఫరాకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు
- వరంగల్ పాల పరిధి ఉపసంచాలకుడు జి. ధనరాజ్

**కాకతీయ, వరంగల్ బ్యూరో :**

వరంగల్ పాల పరిధిలోని విజయ తెలంగాణ డెయిరీ అభివృద్ధి, ఆధునీకరణ, మరమ్మతులు, మౌలిక వసతుల మెరుగుదల కోసం హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ రూ.1.85 కోట్ల నిధులు మంజూరు చేశారు. ఇందులో భాగంగా తొలి విడతలో రూ.89.50 లక్షలు విడుదల చేసేందుకు ఉత్తర్వులు జారీ చేశారు. డెయిరీ అభివృద్ధికి నిధులు మంజూరు కావడంతో పాడి రైతులకు మెరుగైన సేవలు అందించడంతోపాటు వినియోగదారులకు నాణ్యమైన పాలు, పాల ఉత్పత్తులను సరఫరా చేసేందుకు మార్గం సుగమమైంది. తెలంగాణ పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య మేనేజింగ్ డైరెక్టర్ కె. చంద్రశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు వరంగల్ పాల పరిధిలోని విజయ తెలంగాణ డెయిరీ అభివృద్ధి, మరమ్మతులు, మౌలిక వసతుల మెరుగుదలకు సంబంధించిన నివేదికను హనుమకొండ జిల్లా కలెక్టర్‌కు సమర్పించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ రూ.1.85 కోట్ల నిధుల మంజూరుకు ఉత్తర్వులు జారీ చేశారు. డెయిరీని ఆధునీకరించి, అవసరమైన మౌలిక వసతులను బలోపేతం చేయడం ద్వారా పాల ఉత్పత్తుల నాణ్యతను మెరుగుపరచడంతోపాటు పాడి రైతులు, వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.

**నేటి నుంచి ప్యాకింగ్ కార్యకలాపాలు నిలిపివేత..**

విజయ తెలంగాణ డెయిరీ అభివృద్ధి, ఆధునీకరణ పనుల నేపథ్యంలో హనుమకొండ జిల్లాలోని వరంగల్ డెయిరీలో పాల ప్యాకింగ్ కార్యకలాపాలను అక్టోబర్ 10 నుంచి తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. హైదరాబాద్‌లోని విజయ తెలంగాణ డెయిరీ ప్రధాన కార్యాలయం ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అయితే, ప్యాకింగ్ కార్యకలాపాలు నిలిచిపోయినప్పటికీ వినియోగదారులకు పాలు, పాల పదార్థాల సరఫరాలో అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా రావిర్యాలలోని మెగా డెయిరీ నుంచి పాలు, పాల ఉత్పత్తులను తీసుకొచ్చి గ్రేటర్ వరంగల్ పరిధిలోని వినియోగదారులకు అందుబాటులో ఉంచేందుకు చర్యలు చేపట్టారు. ప్రజలకు అవసరమైన మేరకు పాల ఉత్పత్తులు అందేలా సరఫరా వ్యవస్థను కొనసాగించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.



**అందరూ సహకరించాలి..**

డెయిరీ అభివృద్ధి, ఆధునీకరణ పనులు విజయవంతంగా పూర్తయ్యేందుకు పాల పంపిణీదారులు, ఏజెంట్లు, విక్రయదారులు, వినియోగదారులు, పాడి రైతులు సహకరించాలని వరంగల్ పాల పరిధి ఉపసంచాలకుడు జి. ధనరాజ్ కోరారు. జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, జిల్లా యంత్రాంగం అందిస్తున్న సహకారంతో డెయిరీ అభివృద్ధి, పాడి రైతుల ప్రయోజనాల పరిరక్షణ, వినియోగదారులకు నాణ్యమైన పాల ఉత్పత్తుల సరఫరాకు అవసరమైన చర్యలు కొనసాగిస్తామని ఆయన తెలిపారు.

# రాష్ట్రంపై ఎల్‌నినో ముప్పు

- అన్నివర్గాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- రానున్న 8 నెలలు అత్యంత కీలకం..
- చేతికొచ్చే పంటలను కాపాడాలి.. చుక్క నీరూ వృథా కావొద్దు
- గ్రామస్థాయి నుంచి ప్రజలకు అవగాహన కల్పించాలి
- అధికార యంత్రాంగం ముందస్తు కార్యాచరణకు సీఎం ఆదేశం

**కాకతీయ, హైదరాబాద్ :** ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో తాగునీరు, సాగునీరు, వ్యవసాయం, విద్యుత్ రంగాల్లో సంక్షోభం తలెత్తే ప్రమాదం ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. పరిస్థితిని ముందుగానే గుర్తించామని, సమస్య తీవ్రత పెరగకుండా ఇప్పటి నుంచే పకడ్బందీ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. శనివారం జూబ్లీహిల్స్ నివాసంలో ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో రాబోయే సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు అవసరమైన కార్యాచరణపై చర్చించారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ప్రజలను అప్రమత్తం చేసి, నీటి పొదుపు, విద్యుత్ వినియోగం, పంటల సంరక్షణపై అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కోవడంలో రాబోయే 8 నెలలు కీలకమని సీఎం పేర్కొన్నారు. ప్రతి కార్యాచరణలో ప్రజలను భాగస్వాములను చేయాలని, అందుబాటులో ఉన్న నీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ కొనుగోలుకు ప్రభుత్వం ఎంత ఖర్చు చేసేందుకైనా సిద్ధంగా ఉన్నప్పటికీ, మార్కెట్‌లో విద్యుత్ అందుబాటుపై పరిమితులు ఉన్నాయని తెలిపారు. అందుబాటులో ఉన్న విద్యుత్‌ను సమర్థంగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విద్యుత్ ఆధారిత పనులను సాధ్యమైనంత వరకు తాత్కాలికంగా వాయిదా వేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**పంటలు చేతికొచ్చే వరకు నీటి భరోసా**

రైతులు సాగు చేసిన పంటల పరిస్థితులను క్షేత్రస్థాయిలో అంచనా వేసి, పంట చేతికొచ్చే వరకు నీటి కొరత లేకుండా చూడాలని రేవంత్‌రెడ్డి ఆదేశించారు. భవిష్యత్తులో నీటి సమస్య తీవ్రతరం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, చుక్క నీరు కూడా వృథా కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎల్‌నినో ప్రభావంపై సినిమాలు, మీడియా, కళాజాతలు, ఇతర ప్రచార మాధ్యమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. దసరా తర్వాత గ్రామం, మండలం, జిల్లా, రాష్ట్రస్థాయుల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులపై త్వరలో మంత్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు సీఎం తెలిపారు. దాదాపు 215 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో కరువు మండలాల ప్రకటనతోపాటు ఆర్థిక సాయం అందించాలని, రూ.20 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ కేటాయించాలని కేంద్రాన్ని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసిన విషయాన్ని గుర్తుచేశారు. వికసిత్ భారత్-గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ప్రస్తుతం కల్పించే 125 రోజుల పనికి అదనంగా మరో 50 రోజుల ఉపాధి కల్పించాలని కేంద్రాన్ని కోరాలని అధికారులకు సూచించారు. అదనపు పనిదినాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అవసరమైతే అఖిలపక్ష సమావేశం నిర్వహించే అంశాన్ని మంత్రుల భేటీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించేందుకు ప్రత్యేక వార్ రూమ్, టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. విద్యుత్ సరఫరాను ముఖ్యమంత్రి కార్యాలయ ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారు రామకృష్ణారావు, ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డీజీపీ సీవీ ఆనంద్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## సాఫ్ట్ బాల్ ఆసోసియేషన్ సేవలు అభినందనీయం : డాక్టర్ పావుశెట్టి శ్రీధర్



**కాకతీయ, హనుమకొండ:** ఉమ్మడి వరంగల్ జిల్లా సాఫ్ట్ బాల్ ఆసోసియేషన్ సేవలు అభినందనీయమని అంజన హోమియో కేర్ ఆసుపత్రి అధినేత, ప్రముఖ హోమియోపతి వైద్యులు డాక్టర్ పావుశెట్టి శ్రీధర్ కొనియాడారు. హనుమకొండలోని ఇండోర్ స్టేడియంలో శనివారం నిర్వహించిన మినీ సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి జట్టు అభినందన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉమ్మడి వరంగల్ జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ పిల్లి సాంబశివరావు, సెక్రెటరీ తాబేటి రాజేందర్, ఉపాధ్యక్షులు పెరుమాండ్ల సాంబమూర్తి, కోశాధికారి వెంకటేశ్వర్లు, సీనియర్ క్రీడాకారులు సాఫ్ట్బాల్ క్రీడాభివృద్ధికి అహర్నిశలు కృషి చేశారని తెలిపారు. నిజామాబాద్ జిల్లాలో ఈనెల 11, 12 వ తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో హనుమకొండ జిల్లా జట్టు ప్రతిభను కనబరిచి జాతీయ స్థాయికి ఎదగాలని కోరారు. అంతకుముందు హనుమకొండ జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ సెక్రటరీ రాజేందర్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు పెరుమాండ్ల సాంబమూర్తి, జాయింట్ సెక్రటరీ సుమలత, కోచ్ పోలేపాక వినయ్ కుమార్, ఆసోసియేషన్ ప్రతినిధులు అర్జున్, రాజేశ్వర్, ఫిజికల్ డైరెక్టర్లు ఏ. సృజన, శోభ, తాబేటి నాగరాజు, సీనియర్ క్రీడాకారులు పవన్, తల్లిదండ్రులు పాల్గొన్నారు

## జిల్లా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరపాలి

- పదేళ్ల జనగామ జిల్లా ప్రగతిని చాటేలా వేడుకలు నిర్వహించాలి
- కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేయాలని పిలుపు
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



**కాకతీయ, దేవరుప్పల :** జనగామ జిల్లా ఆవిర్భవించి పదేళ్లు పూర్తవుతున్న సందర్భంగా జిల్లా కేంద్రంలో వేడుకలను ఘనంగా నిర్వహించాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మహబూబాబాద్ జిల్లా పర్యటనకు వెళ్తున్న వారు దేవరుప్పుల మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఆదివారం జనగామ జిల్లా కలెక్టరేట్ వద్ద మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి ఆవిర్భావ వేడుకలు నిర్వహించాలని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జనగామ జిల్లా ఏర్పాటుతో జిల్లా కార్యాలయం, మెడికల్ కళాశాల, మాతా శిశు ఆసుపత్రి, వల్మిడి, బమ్మెర పోతన, పాలకుర్తి సోమేశ్వరస్వామి ఆలయం, జిడికల్ దేవాలయం వంటి ప్రాంతాలు అభివృద్ధి చెందాయని వారు పేర్కొన్నారు. దేవాదుల రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేసి జనగామ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేశామని తెలిపారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని, కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధి చెందుతుందని వారు వ్యాఖ్యానించారు. ఆదివారం జరిగే వేడుకలకు జనగామ, పాలకుర్తి, స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గాల నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దేవరుప్పుల మండల బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## సోమేశ్వరాలయం హుండీ ఆదాయం రూ.21.98 లక్షలు

- రూ.21,98,507 నగదు.. మిశ్రమ బంగారం, వెండి సమర్పణ
- విదేశీ కరెన్సీ కూడా హుండీలో వేసిన భక్తులు
- ఆలయ ఈవో భాగం లక్ష్మీ ప్రసన్న వెల్లడి



**కాకతీయ, పాలకుర్తి :** పాలకుర్తి మండల కేంద్రంలోని స్వయంభూ శ్రీ సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.21,98,507 సమకూరినట్లు ఆలయ ఈవో భాగం లక్ష్మీ ప్రసన్న తెలిపారు. 2026 మార్చి 24 నుంచి అక్టోబర్ 9 వరకు భక్తులు సమర్పించిన కానుకలను ఆలయ కల్యాణ మండపంలో శుక్రవారం లెక్కించారు. వల్మిడి శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ ఈవో వెంకట్‌రెడ్డి పర్యవేక్షణలో ఈ ప్రక్రియ నిర్వహించారు. నగదుతో పాటు 5 గ్రాముల 580 మిల్లీగ్రాముల మిశ్రమ బంగారం, 1 కిలో 359.740 గ్రాముల మిశ్రమ వెండి లభించాయి. విదేశీ కరెన్సీలో 230 అమెరికా డాలర్లు, 30 బ్రిటిష్ పౌండ్లు, 150 నేపాల్ రూపాయలు వచ్చినట్లు ఈవో వివరించారు. హుండీ లెక్కింపులో ఆలయ అర్చకులు, సిబ్బంది, శ్రీ సోమేశ్వర-రాజరాజేశ్వరి సేవా ట్రస్ట్ సభ్యులు, తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంకు సిబ్బంది, స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## టీపీటీఎఫ్ ఇనుగుర్తి మండల నూతన కమిటీ

- అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కదిరే ప్రభాకర్, సుక్క ఉప్పలయ్య
- పీఆర్సీ నివేదికను వెంటనే అమలు చేయాలి
- టీపీటీఎఫ్ మండల శాఖ నూతన కమిటీ

**కాకతీయ, ఇనుగుర్తి:** తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) ఇనుగుర్తి మండల శాఖ నూతన కమిటీని మండల శాఖ అధ్యక్షుడు ఉప్పలయ్య అధ్యక్షతన ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా వెంకటరమ నరసయ్య, పరిశీలకుడిగా సంఘ శ్రీనివాస్ పాల్గొన్నారు. మండల అధ్యక్షుడిగా కదిరే ప్రభాకర్, ప్రధాన కార్యదర్శిగా సుక్క ఉప్పలయ్య, ఉపాధ్యక్షులుగా సారంగపాణి, కౌసర్, కార్యదర్శులుగా రాజు, సాగర్, కోటేశ్వరరావు ఎన్నికయ్యారు. ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా వేణు, సభ్యుడిగా ఎండీ మహమ్మద్, అకాడమిక్ సెల్ కన్వీనర్‌గా దయాకర్, సభ్యులుగా సాయికుమార్, శైలజ, సతీష్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ ప్రభుత్వం పీఆర్సీ కమిటీ నివేదికను వెంటనే తెప్పించుకొని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కమిటీ కాలపరిమితి ముగిసినా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు. ఉద్యోగులు, పెన్షనర్లకు రావాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.




# వరంగల్‌ను ముక్కలు చేశారు

- జిల్లా విభజనతో పదేళ్లుగా ప్రజలకు తిప్పలు
- అశాస్త్రీయ నిర్ణయాలతో చారిత్రక నగర అస్తిత్వానికి దెబ్బ
- ఒకే నగరానికి రెండు జిల్లాల పాలనతో ప్రజలకు ఇబ్బందులు
- డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి ధ్వజం



**కాకతీయ, వరంగల్ బ్యూరో:** ఉమ్మడి వరంగల్ జిల్లాను శాస్త్రీయ ప్రణాళిక లేకుండా విభజించి పదేళ్లు పూర్తయినా ప్రజల సమస్యలు పరిష్కారం కాలేదని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి విమర్శించారు. పరిపాలనా వికేంద్రీకరణ పేరుతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు వరంగల్ చారిత్రక అస్తిత్వాన్ని దెబ్బతీశాయని మండిపడ్డారు. జిల్లా విభజనకు పదేళ్లు పూర్తయిన సందర్భంగా శనివారం ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ, ప్రజా సంఘాలు నగరంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించి కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశాయి. వరంగల్, హనుమకొండ ప్రాంతాలకు ఒకే సంస్కృతి, చారిత్రక వారసత్వం ఉన్నప్పటికీ వేర్వేరు జిల్లాలుగా విభజించడం వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఇనగాల అన్నారు. రేషన్ కార్డులు, రెవెన్యూ రికార్డులు, భూముల రిజిస్ట్రేషన్లు, కుల ధ్రువీకరణ పత్రాల కోసం ఏ జిల్లా కార్యాలయాన్ని సంప్రదించాలో తెలియక అయోమయానికి గురవుతున్నారని పేర్కొన్నారు. కొత్త జిల్లాలకు అవసరమైన మౌలిక వసతులు, కార్యాలయ భవనాలు సకాలంలో ఏర్పాటు చేయకపోవడంతో సమస్యలు పెరిగాయని విమర్శించారు.

**జయశంకర్ సార్ పేరు విషయంలోనూ తప్పిదం**

తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జన్మస్థలం ఆత్మకూరు మండలం అక్కంపేట గ్రామమని, ఆయనకు వరంగల్ ప్రాంతంతో విడదీయలేని అనుబంధం ఉందని ఇనగాల గుర్తుచేశారు. అలాంటి మహనీయుడి పేరు భూపాలపల్లి జిల్లాకు పెట్టే విషయంలో గత ప్రభుత్వం అనాలోచితంగా వ్యవహరించిందని విమర్శించారు. మహనీయుల పేర్లను జిల్లాలకు పెట్టడాన్ని స్వాగతిస్తామని, అయితే వారి జన్మస్థలం, జీవిత అనుబంధం ఉన్న ప్రాంతాల చారిత్రక ప్రాధాన్యాన్ని విస్మరించరాదని అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాను ఆరు జిల్లాలుగా విభజించడం, అనంతరం ఉద్యోగుల సర్దుబాటు, స్థానికతకు సంబంధించిన సమస్యలతో యువతకు నష్టం జరిగిందని ఇనగాల ఆరోపించారు. పారిశ్రామిక రంగంలో ఆశించిన స్థాయిలో పరిశ్రమలు రాకపోవడంతో నిరుద్యోగ సమస్య కొనసాగుతోందన్నారు. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో గత ప్రభుత్వం తగిన శ్రద్ధ చూపలేదని విమర్శించారు.

**సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణంలో జాప్యం**

వరంగల్ సెంట్రల్ జైలును తొలగించి 24 అంతస్తులు, 2,000 పడకలతో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మిస్తామని గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రకటించినా పనులు పూర్తి చేయడంలో జాప్యం జరిగిందని ఇనగాల విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు చర్యలు చేపట్టారని తెలిపారు. నిధులు, అధునాతన వైద్య పరికరాలు, సిబ్బందిని అందుబాటులోకి తీసుకురావడంపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో మిగిలిన వాటిని పూర్తి చేయడంలో ప్రస్తుత ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఇనగాల ఆరోపించారు. ప్రజలకు పాలనను చేరువ చేయడంతో పాటు పరిపాలనా సమస్యలను పరిష్కరించి వరంగల్ సమగ్ర అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నగర చారిత్రక ప్రాధాన్యాన్ని, ప్రజల ప్రయోజనాలను కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రజా సంఘాలతో కలిసి పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డితో పాటు రాష్ట్ర, జిల్లా స్థాయి కాంగ్రెస్ నాయకులు, వివిధ సంస్థల చైర్మన్లు, కుడా చైర్మన్, పీసీసీ సభ్యులు, జిల్లా కమిటీ ప్రతినిధులు, డివిజన్, మండల అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలి

- 13 కోట్ల ఓటర్ల పేర్ల తొలగింపుపై సీఐటీయూ నిరసన
- ఢిల్లీ ఆందోళనకారులకు మద్దతుగా హైదరాబాద్‌లో ధర్నా




**కాకతీయ,హైదరాబాద్:** హైదరాబాద్: కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లోని గోల్కొండ చౌరస్తాలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఓటర్ల జాబితాల నుంచి 13 కోట్ల మంది పేర్ల తొలగింపునకు నైతిక బాధ్యత వహిస్తూ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ డిమాండ్ చేశారు. ఢిల్లీలో గత 2 రోజులుగా కొనసాగుతున్న నిరసనలను అణచివేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పాలడుగు భాస్కర్ విమర్శించారు. 57 మెట్రో స్టేషన్లతో పాటు న్యూఢిల్లీ రైల్వే స్టేషన్లను మూసివేయడం, ఉత్తర భారతదేశంలోని పలు రైళ్లను రద్దు చేయడంతో సామాన్య ప్రజలు, కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ముళ్ల కంచెలు, బారికేడ్లు ఏర్పాటు చేయడం, ఇంటర్నెట్ సేవలను నిలిపివేయడం, నిరసనకారులపై బలప్రయోగం చేయడం ప్రజాస్వామ్య హక్కులను హరించడమేనని భాస్కర్ అన్నారు. శాంతియుత నిరసనలను నిర్బంధాలతో అడ్డుకోవడం సరికాదని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ఢిల్లీ పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేసినా కేంద్ర ప్రభుత్వ వైఖరిలో మార్పు రాలేదని విమర్శించారు.

**దేశవ్యాప్త పోరాటానికి పిలుపు**

జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేసేంతవరకు పోరాటాన్ని ఢిల్లీకి పరిమితం చేయకుండా దేశవ్యాప్తంగా విస్తరిస్తామని పాలడుగు భాస్కర్ హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య హక్కులను గౌరవించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనకు సీఐటీయూ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కార్యదర్శి జె.కుమారస్వామి అధ్యక్షత వహించారు. సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు, రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, జె.మల్లిఖార్జున్, రాష్ట్ర కార్యదర్శులు జె.వెంకటేశ్, ఎం.వెంకటేశ్, కూరపాటి రమేశ్, పుప్పాల శ్రీకాంత్, పి.సుధాకర్, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.సునీత, రొయ్యల రాజు, హైదరాబాద్ సీఐటీయూ నాయకులు టీ.మహేందర్, మరన్న, కృష్ణస్వామి, గోల్కొండ నగర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ ఎన్నికల ఫలితాలు ప్రభుత్వానికి గొడ్డలిపెట్టు

- ఉద్యోగుల్లో ప్రభుత్వంపై వ్యతిరేకతకు నిదర్శనం
- హామీలు అమలు చేయకపోతే మూల్యం తప్పదు
- బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనే యువరాజు



**కాకతీయ, నర్సంపేట టౌన్ :** ఆర్టీసీ కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వ కూటమి ఓటమి పాలవడం రాష్ట్ర ప్రభుత్వానికి గొడ్డలిపెట్టులాంటిదని బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనే యువరాజు అన్నారు. ఈ ఫలితాలు ఉద్యోగుల్లో ప్రభుత్వంపై నెలకొన్న వ్యతిరేకతకు నిదర్శనమని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు రెండు పీఆర్సీలు పెండింగ్‌లో ఉన్నాయని, మూడు డీఏలు చెల్లించాల్సి ఉండగా రెండే ఇస్తామనడం ఉద్యోగులను నిరాశకు గురిచేస్తోందని విమర్శించారు. గత రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలను అక్టోబర్ జీతంతో కలిపి చెల్లించకుండా, పదవీ విరమణ ప్రయోజనాల్లో కలుపుతామనడం సమంజసం కాదన్నారు. ఇది ఉద్యోగులను మోసం చేయడమేనని మండిపడ్డారు. ఉద్యోగులు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని యువరాజు ఆరోపించారు. ఆర్టీసీ ఎన్నికల ఫలితాలను ప్రభుత్వం హెచ్చరికగా భావించాలని సూచించారు. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ ప్రభుత్వంపై వ్యతిరేకత ఓట్ల రూపంలో వ్యక్తమవుతుందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ గ్రాడ్యుయేట్ అభ్యర్థి విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఉద్యోగులు, కార్మికులు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేసి ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని గోనే యువరాజు డిమాండ్ చేశారు.

## తపాల ఉద్యోగి కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సాయం

**ఏఐజీడీఎస్‌యూ జాతీయ అధ్యక్షుడు బొద్దున వెంకటేశ్వర్లు**

**కాకతీయ, ములుగు :** గ్రామీణ తపాలా ఉద్యోగులది వసుధైక కుటుంబమని, తోటి ఉద్యోగి కుటుంబం కష్టాల్లో ఉన్నప్పుడు అండగా నిలవడం అందరి బాధ్యతని అఖిల భారత గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షుడు, హనుమకొండ జీడీఎస్ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు బొద్దున వెంకటేశ్వర్లు అన్నారు. అనారోగ్యంతో మృతి చెందిన పస్రా సబ్ పోస్టాఫీస్ గ్రామీణ తపాలా ఉద్యోగి సాధిక్ పాషా కుటుంబానికి సొసైటీ తరఫున రూ.50 వేల ఆర్థిక సాయం అందించారు. శుక్రవారం పస్రా సబ్ పోస్టాఫీస్‌లో పోస్టల్ సిబ్బంది సమక్షంలో సాధిక్ పాషా భార్య కైరున్నిసా బేగంకు చెక్కును అందజేశారు. ఉద్యోగి మృతితో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితిలో ఉన్న కుటుంబానికి భరోసా కల్పించాలనే ఉద్దేశంతో ఈ సాయం అందించినట్లు తెలిపారు. గ్రామీణ తపాలా ఉద్యోగుల కుటుంబాలకు అవసరమైన సమయంలో తోడ్పాటు అందించడమే సహకార సంఘం లక్ష్యమని పేర్కొన్నారు. డివిజన్‌లోని ప్రతి ఒక్కరూ కోఆపరేటివ్ సొసైటీలో సభ్యత్వం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి పెరుమాండ్ల తిరుపతి, అజీజ్ పాషా, పి. శ్రీలత, పస్రా సబ్ పోస్టుమాస్టర్ రమేష్, ఇ. సందీప్, విజయశ్రీ, సయ్యద్ వహీద్, సీహెచ్. సాంబయ్య, సీహెచ్. రాహుల్, పి. మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రేమ పేరుతో యువకుడి వేధింపులు.. బాలిక బలవన్మరణం

- ఫోన్‌కాల్స్, ఇన్‌స్టాగ్రామ్ సందేశాలతో వేధింపులు
- హెచ్చరించినా మారని యువకుడి తీరు

**కాకతీయ, చందుర్తి:** ప్రేమ పేరుతో యువకుడు వేధిస్తున్నాడనే ఆరోపణల నేపథ్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం లింగంపేటకు చెందిన 15 ఏళ్ల పదో తరగతి విద్యార్థిని ఇంట్లో ఆత్మహత్యకు పాల్పడింది. రుద్రంగి మండలానికి చెందిన యువకుడు ఫోన్‌కాల్స్, ఇన్‌స్టాగ్రామ్ సందేశాల ద్వారా తరచూ వేధించేవాడని బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. గత నెలలోనే యువకుడిని హెచ్చరించినప్పటికీ అతడి ప్రవర్తనలో మార్పు రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. వేధింపులతో తీవ్ర మనస్తాపానికి గురైన బాలిక బలవన్మరణానికి పాల్పడినట్లు కుటుంబ సభ్యులు ఫిర్యాదులో తెలిపారు. ఈ ఘటనపై బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చందుర్తి సీఐ రవీందర్ వెల్లడించారు.



# పట్టభద్రుల ఓటుతో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

- నిరుద్యోగులను మోసం చేసిన ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు
- 2 లక్షల ఉద్యోగాల హామీ ఏమైంది.. జాబ్ క్యాలెండర్ ఏదీ?
- గురుకులాల్లో వసతులు కల్పించలేని అసమర్థ పాలన
- నవంబర్ 6లోగా ప్రతి గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు కావాలి
- ఖమ్మం–వరంగల్–నల్గొండ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే విజయం
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



**కాకతీయ, మహబూబాబాద్ :** రెండేళ్లలో 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసిందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు విమర్శించారు. ఉద్యోగాల భర్తీ, జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి వంటి హామీలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు సరైన అవకాశమని అన్నారు. ఖమ్మం-వరంగల్-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని, గ్రామగ్రామాన కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని డీఎస్ఆర్ గార్డెన్‌లో నిర్వహించిన పట్టభద్రుల ఓటరు నమోదు సన్నాహక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని ఎర్రబెల్లి దయాకర్‌రావు సూచించారు. ఓటరు నమోదు గడువు నవంబర్ 6తో ముగియనున్న నేపథ్యంలో పార్టీ శ్రేణులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. యువత, ముఖ్యంగా సామాజిక మాధ్యమాల్లో చురుగ్గా ఉండేవారు నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ తరఫున అత్యధిక సంఖ్యలో పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేసి బీఆర్ఎస్ బలాన్ని నిరూపించాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించేందుకు ఈ ఎన్నికలను ఉపయోగించుకోవాలని పేర్కొన్నారు.

**2 లక్షల ఉద్యోగాల హామీ ఏమైంది?**

అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, కానీ ఇప్పటివరకు ఆ హామీని నెరవేర్చలేదని ఎర్రబెల్లి విమర్శించారు. జాబ్ క్యాలెండర్ విడుదల చేసి ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి నిరుద్యోగులను రోడ్లపైకి తెచ్చారని మండిపడ్డారు. డిగ్రీ, అంతకంటే ఎక్కువ చదువుకున్న యువతకు ఇప్పటివరకు ఎన్ని ఉద్యోగాలు కల్పించారో సీఎం రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు నెలకు రూ.4,000 భృతి ఇస్తామని చెప్పిన హామీ ఏమైందని ప్రశ్నించారు. అశోక్‌నగర్‌లో నిరుద్యోగులను కలిసి ఉద్యోగాల కల్పనపై హామీ ఇచ్చిన రేవంత్‌రెడ్డి, రాహుల్‌గాంధీ ఇప్పుడు సమాధానం చెప్పాలని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో గురుకులాలను ఏర్పాటు చేసిందని ఎర్రబెల్లి గుర్తుచేశారు. ప్రస్తుత ప్రభుత్వం గురుకులాల్లో కనీస వసతులు కల్పించడంలోనూ విఫలమైందని విమర్శించారు. పురుగుల అన్నం తిని విద్యార్థులు ఆసుపత్రుల పాలవుతున్నా సరైన పర్యవేక్షణ లేదని ఆరోపించారు. విద్యార్థులకు రూ.5 లక్షల విద్యా భరోసా కార్డులు ఇస్తామని చెప్పి స్కాలర్‌షిప్‌లు కూడా సకాలంలో అందించలేని పరిస్థితి నెలకొందన్నారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన విదేశీ విద్యా స్కాలర్‌షిప్‌లను నిలిపివేసి విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతోందని విమర్శించారు. విద్యార్థినులకు స్కూటీలు పంపిణీ చేస్తామన్న హామీని ఎప్పుడు అమలు చేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు.

**ఉద్యోగులు, నిరుద్యోగులకు సమాధానం చెప్పాలి**

ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్సీ, టీఏ, డీఏలు ఎందుకు ఇవ్వడం లేదో రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని ఎర్రబెల్లి డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఐటీ రంగంలో పనిచేసేవారు, చదువుకున్న నిరుద్యోగులు కాంగ్రెస్ పాలనలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలను నిర్లక్ష్యం చేస్తూ, మరోవైపు ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులకు చెందినట్లు పేర్కొంటున్న అంతర్జాతీయ పాఠశాలలపై దృష్టి పెట్టడం వెనుక ఉద్దేశమేంటో ప్రజలకు వివరించాలని ప్రశ్నించారు. ఖమ్మం-వరంగల్-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఎవరైనా విజయం సాధించడం ఖాయమని ఎర్రబెల్లి దయాకర్‌రావు ధీమా వ్యక్తం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామగ్రామాన పర్యటిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయడంతో పాటు, ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపు కోసం సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, రెడ్యా నాయక్, మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్, మాజీ ఎంపీ మలోత్ కవిత, మాజీ మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

Printed and published owned by kiran goud arelli be half of amulya publications & printers graphics. printed at hanamkonda and published at H No. 5-12-42, pvr residency, hanuman nagar, hanamkonda- 506009- EDITOR- ARELLI KIRAN GOUD - RNI NO. TG TEL/25/A1234 - contact - 7396604266